E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

22-3-2025 శనివారం | పేజీలు–6 | హైదరాబాద్ | ekaburu.com




సీబీఐ అదుపులో మరో అవినీతి తిమింగలం

3లో

# లక్షల కోట్లు ఖర్చుపెట్టి ఏం చేశారు?



- శాసనసభ ఆమోదం లేకుండానే కేసీఆర్ రూ.2.30 లక్షల కోట్లు ఖర్చు చేశారు
- ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అడ్డగోలుగా అప్పులు తెచ్చిందని మండిపాటు
- ప్రభుత్వం గ్యారంటీలకు కేటాయించింది రూ.56.80 వేల కోట్లు : డిప్యూటీ సీఎం
- రూ.16.70లక్షల కోట్లు ఖర్చుపెట్టి ఏం చేశారు?
- భారాస పాలనాతీరుపై అసెంబ్లీలో విరుచుకుపడ్డ డిప్యూటీ సీఎం : భట్టి

**కేసీఆర్ సారథ్యంలోని భారాస ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అడ్డగోలుగా అప్పులు తెచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.**

2లో



## బీఆర్ఎస్ పై కోపంతో అప్పుల లెక్క ఎక్కువ చేసి చూపొద్దు: హరీశ్‌రావు

- బీఆర్ఎస్ హయాంలో చేసిన మొత్తం అప్పు రూ.4.22 లక్షల కోట్లు అని ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు
- కృష్ణ జలాలపై ప్రభుత్వం పోరాటం చేయాలి.
- కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ సెక్షన్స్3 తీసుకొచ్చారు.
- మీరు చెప్పుకుంటున్న 57వేల ఉద్యోగాల్లో మేం ఇచ్చినవే 50వేలు. ఆరు వేల పోస్టులు కూడా ఇవ్వలేదు.
- 15నెలల పాలనలో మీరు నోటిఫికేషన్లు ఇచ్చి, భర్తీ చేసిన పోస్టులు ఎన్ని?
- పూర్తిగా 100%రుణమాఫీ అయిందని నిరూపిస్తే బహిరంగ క్షమాపణ చెప్తాను.
- 575 టీఎంసీలను తెలంగాణకు తీసుకురావాలి.

2లో

## ఆ రోడ్లకు టోల్ విధించే ఆలోచన లేదు: కోమటిరెడ్డి



గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులకు టోల్ విధించే ఆలోచన లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.

2లో

## నిమిషానికి రూ. కోటికిపైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోంది: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



తెలంగాణ అప్పు రూ.8.6 లక్షల కోట్లుగా ఉందని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

2లో

## పునర్విభజన ఇప్పుడు జాతీయ ఉద్యమం.. వీడియో షేర్ చేసిన స్టాలిన్



3లో

## హనీట్రాప్ రగడ.. 18 మంది భాజపా ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు

**సభా కార్యక్రమాలను అడ్డుపడిన 18 మంది భాజపా ఎమ్మెల్యేలపై కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు.**



**ఈ-కబురు:** కర్ణాటకలో మంత్రులు సహా అనేక మంది ముఖ్యనేతలే లక్ష్యంగా కొనసాగుతోన్న 'హనీ ట్రాప్' వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. జాతీయ స్థాయి నేతలు సహా 48 మంది రాజకీయ నాయకులు 2లో

## అవినీతిని దాచేందుకే భాషా వివాదం.. విపక్షాలపై విరుచుపడిన అమిత్‌షా

**కొందరు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం, అవినీతిని కప్పిపెట్టేందుకు భాషా వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని అమిత్‌షా దుయ్యబట్టారు.**



**ఢిల్లీ:** రాజకీయంగా లబ్ధి పొందేందుకు, అవినీతిని దాచి పెట్టేందుకే కొన్ని పార్టీలు భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దుయ్యబట్టారు. భాష పేరిట 2లో

# తక్కువ వడ్డీకే రుణాలివ్వండి.. నాబార్డు ఛైర్మన్‌తో సీఎం రేవంత్ భేటీ

**ఈ-కబురు, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నాబార్డ్ ఛైర్మన్ షాజీ కేవీ శుక్రవారం భేటీ అయ్యారు. ఆర్ఐడీఎఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలు అందించాలని నాబార్డు ఛైర్మన్‌ను సీఎం కోరారు. మైక్రో ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వాలని సీఎం కోరారు. కోఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలని, కొత్తగా మరిన్ని కోఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలని నాబార్డు ఛైర్మన్‌కు రేవంత్ విజ్ఞప్తి చేశారు.స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని కోరిన సీఎం.. ఐకేపీ, గోడౌన్స్, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి రాష్ట్రంలో మిల్లింగ్ కెపాసిటీ పెంచేందుకు సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు.



ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు స్కీమ్‌లు నిధులు మార్చి 31లోగా ఉపయోగించుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. నాబార్డు పరిధిలోని స్కీములన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువ ఉపయోగించుకోవాలని సీఎం అన్నారు.

స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్స్ నిర్వహణను నాబార్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. కొత్త గ్రామ పంచాయతీలకు రూరల్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొత్త జిల్లాల్లో కొన్ని డీసీసీబీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి నాబార్డు ఛైర్మన్ ప్రతిపాదించారు. ఈ సమావేశంలో నాబార్డు ప్రతినిధులతోపాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

## శాసన మండలిలో భారాస, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం



తెలంగాణ శాసన మండలిలో భారాస, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

## అమెరికాతో సంప్రదింపులు జరుపుతున్నాం ట్రంప్ ప్రతీకార సుంకాలపై భారత్



3లో

## ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై హైకోర్టులో విచారణ

**ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది.**

**ఈ-కబురు హైదరాబాద్:** ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ అంశంపై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం శుక్రవారం విచారించింది. మాజీ ఎంపీ హరిరామజోగయ్య దాఖలు చేసిన ప్రయోప్రయోజన వ్యాజ్యాన్ని కలిపి విచారణ జరిపింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను వేగంగా విచారించాలని హరిరామజోగయ్య గతంలో ఫిర్యాదు చేశారు. తెలంగాణలోని వివిధ కోర్టుల్లో ప్రజాప్రతినిధులపై 309కి పైగా కేసులున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. విచారణలో పురోగతిపై కౌంటర్ దాఖలకు సమయం కోరారు. విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు ఆదేశించిందని హరిరామజోగయ్య తరపు న్యాయవాది తెలిపారు. మార్చి 31వరకు ఉన్న కేసుల పురోగతి తెలపాలని ఏఏజీకి ఆదేశించిన ప్రత్యేక ధర్మాసనం..అందుకు



నాలుగు వారాల సమయం ఇచ్చింది.

**డ్రైవర్‌కు వైద్యం అందించాలని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల ఆదేశం**

బెంగళూరులో ఏపీ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనపై ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు స్పందించారు. ఈ ఘటనపై విచారణ జరపాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఆదేశించారు. దాడి చేసిన కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాలని సూచించారు. దాడికి గురైన ఏపీ ఆర్టీసీ డ్రైవర్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఎండీకి ఆదేశాలు జారీ చేశారు.



## ట్రంప్‌రాకతో శ్వేత సౌధం స్వర్ణమయం..!

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేత సౌధంలో అడుగు పెట్టాక.. తన కార్యాలయంలో బంగారపు వస్తువుల వినియోగాన్ని పెంచారు.**

**ఈ-కబురు:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎంపిక కావడంతో.. శ్వేతసౌధం రూపురేఖలు మారిపోయాయి. ఎక్కడ చూసినా స్వర్ణకాంతులీనుతోంది. తన వ్యక్తిగత బ్రాండ్‌ను ప్రతిబింబించేలా వస్తువులను ప్రత్యేకంగా ఎంపిక చేసి మరీ ట్రంప్ ఏర్పాటు చేయిస్తున్నారట.

ఇటీవల ఫాక్స్ న్యూస్ యాంకర్ ఇన్‌గ్రాహమ్ అధ్యక్ష కార్యాలయమైన ఓవల్ ఆఫీస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బంగారపు వస్తువులను ట్రంప్ చూపించారు. బంగారు ఫ్రేముల్లోని చిత్రాలు ఉన్నాయి. వీటిల్లో మాజీ అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్, ఆండ్రూ జాక్సన్ వంటి ప్రముఖుల చిత్రాలున్నాయి. స్వర్ణ కాంతులీనుతున్న అద్దాలు, సైడ్ టేబుల్స్‌పై బంగారపు పక్షి బొమ్మలు, తలుపులు, టెలివిజన్‌ను నియంత్రించే రిమోట్‌పై కూడా పుత్తడి తాపడం చేయించారు. తన కార్యాలయంలోని పేపర్ వెయిట్‌పై కూడా ట్రంప్ పేరుతో గోల్డ్ స్టాంప్ ఉంది. ఫీఫా ప్రపంచకప్ నకలు కూడా అక్కడ ఉంది. ఈ అలంకరణలు తరువాయి 2లో

# బీఆర్ఎస్ పై కోపంతో అప్పుల లెక్క ఎక్కువ చేసి చూపొద్దు: హరీశ్‌రావు

**ఈ-కబురు హైదరాబాద్:** బీఆర్ఎస్ హయాంలో చేసిన మొత్తం అప్పు రూ.4.22 లక్షల కోట్లు అని ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని పదే పదే చెప్పవద్దని.. భారాసపై కోపంతో అప్పుల లెక్క ఎక్కువ చేసి చూపొద్దని కోరారు. శాసనసభలో హరీశ్‌రావు మాట్లాడారు. ఇది అవాస్తవిక బడ్జెట్.. గాలి మేడల బడ్జెట్ అని తీవ్రంగా విమర్శించారు.

"కృష్ణా నదీ జలాలపై ఈ బడ్జెట్‌లోనే చర్చ పెట్టాలి. మీ నిర్వాకం వల్ల ఈ ఏడాది 34 శాతం వాడాల్సిన నీళ్లలో.. 24 శాతమే వాడారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంటలు ఎండుతున్నాయి. నీటిని రాబట్టడంలో ప్రభుత్వం ఎలా విఫలమైందో చర్చించాలి. తెలంగాణకు వరంగా ఉన్న సెక్షన్3ని భారాస సాధించింది. ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలి. తెలంగాణకు న్యాయబద్ధమైన 575 టీఎంసీలను రాబట్టాలి" అని హరీశ్‌రావు అన్నారు.

తెలంగాణ బడ్జెట్‌పై అసెంబ్లీ వేదికగా వాడీ వేడి చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ మంత్రులు.. మాజీ మంత్రి హరీష్ రావు మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బడ్జెట్ కేటాయింపులు... కాంగ్రెస్ పాలనపై హరీష్ రావు సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ఆర్‌ఆర్ టాక్స్‌లతో ఆర్థిక మాంద్యం అల్లకల్లోలం అయింది. హైడ్రాతో భయపెట్టారని వ్యాఖ్యలు చేశారు. గత బడ్జెట్‌లో భట్టి విక్రమార్క చెప్పిన విషయాలను ప్రస్తావించిన హరీష్. సభలో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ..'గత సంవత్సరం బడ్జెట్‌ను సమీక్షించుకుందాం. ఫార్మాసిటీ భూములపై నాడు పోరాటం చేశారు. ఇప్పుడు బలవంతంగా రైతుల నుంచి లాక్కుంటున్నారు. అలాగే, రుణమాఫీకి 31వేల కోట్లు సిద్ధం చేశామని గత బడ్జెట్‌లో చెప్పారు. ఇప్పుడు 21వేల కోట్లు రుణమాఫీ చేశామని అంటున్నారు. చేతగాని వాళ్లు ఎవరో ప్రజలకు అర్థమైంది. ఏడాదిలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదు. నిరుద్యోగులను మోసం చేశారు. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఎన్నికల హామీలను నెరవేర్చలేదు. రైతు భరోసా 15వేలు ఇస్తామన్నారు. వానాకాలంలో ఎగబెట్టారు. యాసంగిలో 12వేలు అన్నారు. అది కూడా సరిగా అందలేదు. కౌలు రైతులకు 12వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు, రైతులు, కౌలు రైతులే తేల్చుకోవాలంటున్నారు. కౌలు రైతులకు అన్యాయం జరిగింది. జాబ్ క్యాలెండర్.. జాబ్ లెస్‌గా క్యాలెండర్‌గా మారింది. రివైజ్డ్ ఎస్టిమేషన్స్‌లో 27వేల కోట్లు తక్కువ చేసి చూపారు. హెచ్‌ఎండీఏ ఆస్తులు తాకట్టు పెట్టి రుణాలు తెస్తామంటున్నారు. హౌసింగ్ బోర్డు భూముల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. గతంలో ప్రభుత్వ భూములు అమ్మవద్దన్న వారే అప్పుడు అమ్మకానికి పెట్టారు. ప్రభుత్వ భూములు అమ్మితే ఆనాడు విమర్శించారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వనందుకు క్షమాపణ చెప్పాలి. బడ్జెట్‌లో ప్రజలను మాయచేసే ప్రయత్నం చేశారు.



**కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో కేవలం 6000 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారు. మిగతా ఉద్యోగాలు అన్ని బిఆర్ఎస్ పాలనలో ఇచ్చినవి.**

ప్రభుత్వం 56,000 ఉద్యోగాలు ఇచ్చామని అసత్య ప్రచారం చేస్తోంది. భట్టి విక్రమార్క బడ్జెట్‌పై నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే, ప్రభుత్వం మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఆ మాటను నిలబెట్టుకోలేదు. ఈ ఏడాదైనా ఉద్యోగాల భర్తీ జరుగుతుందని ఆశించిన నిరుద్యోగుల ఆకాంక్షలకు భట్టి బడ్జెట్ గండికొట్టింది. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి నుంచి రాహుల్ గాంధీ దాకా అశోక్ నగర్ చుట్టూ అంగ ప్రదక్షిణలు చేశారు. ఊరు ఊరుగా బస్సు యాత్రలు చేసి నిరుద్యోగులను రెచ్చగొట్టారు. వారిని పార్టీ కార్యకర్తలుగా మార్చుకుని ఇళ్లకు తిప్పారు. నాడు నమ్మించిన వారు నేడు నిరుద్యోగులను మోసం చేశారు. అయితే, దీనికి భిన్నంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని తప్పుదారి పట్టించే ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ లక్ష్యాలు నిధులు, నీళ్లు, నియామకాలు నెరవేర్చిన ప్రభుత్వం బీఆర్ఎస్. తెలంగాణ ఉద్యమం ఎందుకు ప్రారంభమైంది? ముల్కీ రూల్స్ నుంచి 610 జీఓ దాకా తెలంగాణ పోరాడింది దేనికోసం? స్థానిక ఉద్యోగాలు స్థానికులకే దక్కాలని. ఆ లక్ష్యాన్ని కేసీఆర్ నెరవేర్చారు. అటెండర్ స్థాయి నుంచి ఆర్డీవో స్థాయి వరకు 95% ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా చేశారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో అక్షరాల లక్షా 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఈ విషయంపై నేను పూర్తిగా కట్టుబడి ఉన్నాను. "ఒక్క ఉద్యోగం ఇవ్వలేదనే" ప్రచారం పూర్తిగా అసత్యం. అబద్ధమే మీ రాజకీయ ధోరణి, అబద్ధమే మీ ప్రచారం. ఇదే కాదు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, మీరు చెబుతున్న 57,000 ఉద్యోగాల లెక్క ఉద్యోగ నియామకాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలి. మేము ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రాలు ఏడాదిన్నరుగా పంపిణీ చేస్తున్నాం. కానీ మీరు కొత్తగా వెలగబెట్టింది ఏమీలేదు. గ్రామపంచాయతీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పంచాయతీలకు నిధులు విడుదల చేయడం లేదు. ఈ అంశంపై ప్రభుత్వాన్ని అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ చేశారు. ప్రభుత్వం గ్రామపంచాయతీల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

> జాబ్ క్యాలెండర్‌పై నిలదీస్తే నిరుద్యోగులను అశోక్‌నగర్‌లో అరెస్ట్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామన్నారు?.. ఉద్యోగాలు ఇచ్చారా?. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చిందా?. ఆర్‌ఆర్‌ఆర్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఎకరమైనా భూసేకరణ చేసిందా?. ఎన్నికల ముందు నో ఎల్‌ఆర్ఎస్.. నో బీఆర్ఎస్ అన్నారు.. ఇప్పుడు ముక్కు పిండి ఎల్‌ఆర్ఎస్ వసూలు చేస్తున్నారు. ఇవి అవాస్తవిక అంచానాలని ఆనాడే చెప్పాను. భూములను అమ్మడం, తాకట్టు పెట్టడం ద్వారా రూ. 50వేల కోట్లు సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. అనుముల వారి పాలనలో ఎన్నికల భూములు అమ్ముతారో చెప్పాలి. ప్రభుత్వ నిర్ణయాలతో ఆర్థిక వృద్ధి రేటు తగ్గుతోంది. దేశమంతా ఆర్థిక మాంద్యం ఉందని అబద్ధాలు చెబుతున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని ఆర్థిక మాంద్యం తెలంగాణలో ఉందంటున్నారు. అంచనాలకు అనుగుణంగా రీచ్ అవుతున్నాయి. ఆర్థిక మాంద్యం ప్రపంచంలో కాదు.. ప్రభుత్వ పెద్దల బుద్ధిలో ఉంది. ప్రభుత్వ నిర్ణయాలతో ఆర్థిక వృద్ధి రేటు తగ్గుతోంది. స్టాంప్, రిజిస్ట్రేషన్ ఆదాయం తెలంగాణలో తగ్గింది. తెలంగాణ రైజింగ్ అంటూ ముఖ్యమంత్రి నినాదం ఇస్తున్నారు. తెలంగాణ రైజింగ్ ఎక్కడ ఉంది?.

> భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గమైనా? సిద్ధిపేట నియోజకవర్గమైనా? గతంలో నేను కేసీఆర్ సంతకాలు పెట్టినట్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. అక్కడ ఆదిత్య నాథ్, తెలంగాణ నుంచి ఎస్కే జోషి మాత్రమే సంతకాలు చేశారు.
>
> కృష్ణా జలాలపై బీఆర్ఎస్ ప్రభుత్వం గురించి ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తుంది. కృష్ణా జలాలపై ప్రత్యేక చర్చ పెట్టాలి. చర్చలకు మేము సిద్ధంగా ఉన్నాం.
> ఎవరిది తప్పు.. ఎవరిది ఒప్పు అనే ప్రజలకు తెలుస్తుంది.



## ఆ రోడ్లకు టోల్ విధించే ఆలోచన లేదు: కోమటిరెడ్డి

**గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులకు టోల్ విధించే ఆలోచన లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.**

**ఈ-కబురు, హైదరాబాద్:** గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులకు టోల్ విధించే ఆలోచన లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శాసనసభలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 40 శాతం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. వారికి ఆరు నెలలు లేదా మూడు నెలలకు చెల్లిస్తామన్నారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి డబుల్ రోడ్లు వేస్తామని తెలిపారు. భారాస హయాంలో సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కే రోడ్లు వేశారని చెప్పారు. ఆ మూడు చోట్ల రోడ్లకు చివరికి సింగరేణి నిధులు కూడా వాడారని పేర్కొన్నారు.

ఛాలెంజ్ చేస్తున్నా.. రాష్ట్రమంతా తిరిగి చూద్దామా అని హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. కోమటిరెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. భారాస హయాంలో ఆర్‌అండ్‌బీ పనుల గురించి లెక్కలు తీద్దామన్నారు. రోడ్ల గురించి ఒకరోజు ప్రత్యేకంగా చర్చిద్దామని చెప్పారు.



## నిమిషానికి రూ.కోటికిపైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోంది: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**తెలంగాణ అప్ప రూ.8.6 లక్షల కోట్లుగా ఉందని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు.**

**హైదరాబాద్:** తెలంగాణ అప్పు రూ.8.6 లక్షల కోట్లుగా ఉందని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రోజుకు రూ.1700 కోట్లకుపైగా కాంగ్రెస్ సర్కారు అప్పు చేస్తోందని విమర్శించారు. బడ్జెట్‌పై శాసనసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.

"నిమిషానికి రూ.కోటికిపైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోంది. రాష్ట్రంలో ఒక్కో వ్యక్తిపై రుణభారం రూ.2.27 లక్షలుగా ఉంది. పెద్ద ఎత్తున రుణాలుంటే తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పాలి. యూపీఏ కంటే ఎన్డీఏ హయాంలో ఆర్థిక సంఘం నిధులు పెరిగాయి. యూపీఏ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో 32 శాతం వాటా ఉండేది. అప్పుడు కేంద్ర పన్నుల్లో వాటా 23 శాతం కూడా పెంచలేదు. మోదీ ప్రభుత్వం వచ్చాక కేంద్ర పన్నుల్లో వాటా 10 శాతం పెంచి 42 శాతం చేశారు. పన్నుల్లో వాటా పెంచాక కూడా కేంద్రాన్ని విమర్శించడం సరికాదు" అని ఆయన అన్నారు.



## శాసన మండలిలో భారాస, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం

**తెలంగాణ శాసన మండలిలో భారాస, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.**

**హైదరాబాద్:** తెలంగాణ శాసన మండలిలో భారాస, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. భారాస హయాంలో ప్రజల ఆకాంక్షల మేరకు పాలన సాగలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. తెలంగాణ ఏర్పడ్డాక పాలన సరిగా జరగలేదన్నారు. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి వ్యాఖ్యలను భారాస ఎమ్మెల్సీలు ఖండించారు. బడ్జెట్ ప్రసంగంపై జవాబివ్వకుండా సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ట్రంప్‌రాకతో శ్వేత సౌధం స్వర్ణమయం..!

మొదటి పేజి తరువాయి

మొత్తం ట్రంప్‌నకు దక్షిణ ఫ్లోరిడాలోని మార్ ఎ లాగో ఎస్టేట్ నివాసాన్ని తలపించేలా ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

కొత్త అధ్యక్షుడు శ్వేత సౌధంలో అడుగుపెట్టినప్పుడు తన కార్యాలయాన్ని నచ్చినట్లు తీర్చిదిద్దుకోవడం కొత్తేమీ కాదు. కానీ, ఆధునిక కాలంలోని అధ్యక్షుల్లో ఎవరూ ట్రంప్‌లా మార్పులు చేయించలేదు. వైట్‌హౌస్‌లోని రోజ్‌గార్డెన్‌లో మార్పులు చేయించేందుకు కూడా ట్రంప్ సిద్ధమయ్యారు.



## అవినీతిని దాచేందుకే భాషా వివాదం.. విపక్షాలపై విరుచుపడిన అమిత్‌షా

మొదటి పేజి తరువాయి

ఇప్పటికే దేశంలో చాలా వరకు విభజన వచ్చిందని, ఇకపై ఎంతమాత్రం జరగబోదని వ్యాఖ్యానించారు. హిందీ ఏ భాషకూ పోటీ కాదని, అన్ని భాషలకూ సోదర భాష అని పేర్కొనారు. ఈ మేరకు రాజ్యసభలో ఆయన వివిధ అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జాతీయ విద్యావిధానం, త్రిభాష అంశంపై వివాదం నెలకొన్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "కొన్ని పార్టీలు తమ సొంత రాజకీయ ప్రయోజనాల కోసం భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయి. వారి అవినీతిని దాచుకునే ప్రయత్నిస్తున్నాయి. దేశంలోని అన్ని భాషలూ దేశానికి ఓ నిధి లాంటిది. హిందీ కూడా ఇతర భాషలకు సోదర భాషే" అని అమిత్ షా అన్నారు. భాష పేరిట విభజన తీసుకొచ్చేందుకు చేపట్టే చర్యలేవీ ఫలించవన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యభాషా విభాగాన్ని ఏర్పాటు చేసిందని చేశారు. తెలుగు, తమిళం, పంజాబీ, అస్సామీ.. ఇలా అన్ని భాషలనూ ప్రాచుర్యం కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమని వివరించారు.



**హనీట్రాప్ రగడ.. 18 మంది భాజపా ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు**

దక్షిణాది భాషలకు కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అమిత్‌షా మండిపడ్డారు. అలాగైతే తాను గుజరాత్ నుంచి, నిర్మలా సీతారామన్ తమిళనాడు నుంచి ప్రభుత్వంలో మంత్రులుగా ఎలా వ్యవహరిస్తున్నామని ప్రశ్నించారు. "ఇంజినీరింగ్, మెడికల్ విద్యను తమిళంలో అందించాలని తమిళనాడు ప్రభుత్వానికి గత రెండేళ్లుగా కోరుతున్నా. దానివల్ల మీ (డీఎంకేని ఉద్దేశిస్తూ) ఆర్థిక ప్రయోజనాలు నెరవేరవని భయపడుతున్నారు. మేం అధికారంలోకి వస్తే మెడికల్, ఇంజినీరింగ్ విద్యను తమిళ భాషలోనే అందిస్తాం" అని అమిత్‌షా అన్నారు. తమిళనాడు అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి.

## 'మహాలక్ష్మి పథకం లేదు కానీ.. అందాలు పోటీలకు మాత్రం సిద్ధం'



**ఈ-కబురు హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు మరోసారి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వేదికగా మాట్లాడిన హరీష్ రావు.. కాంగ్రెస్ ప్రతీ విషయంలోనూ పారియిందంటూ మండిపడ్డారు. ఈరోజు (శుక్రవారం) అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన హరీష్‌రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం తాము అడిగిన ఏ ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వకుండా పారిపోయిందని ఎద్దేవా చేశారు.

' బడ్జెట్ పై ప్రభుత్వం క్లారిఫికేషన్ ఇవ్వకుండా పారిపోయింది. శాసన సభ చరిత్రలో చీకటి రోజు. ప్రభుత్వం తలుపు లు తెచిచే ఉంటాయని చెప్పిన డిప్యూటీ సీఎం భట్టి... కేవలం 20 శాతం కమిషన్ కోసం మాత్రమే తెరిచి ఉంచారని ఎద్దేవా చేశారు హరీష్.ప్రభుత్వం 20 శాతం కమిషన్ అడుగుతుందని కాంట్రాక్టర్లు సెక్రటేరియట్ లో ధర్మ చేశారు. ఉద్యోగుల విషయంలో భట్టి విక్రమార్క సభను తప్పుదోవ పట్టించారు.

2 లక్షల ఉద్యోగలా గురించి ప్రశ్నిస్తే సభను వాయిదా వేసి పారిపోయారు. ఎల్‌ఆర్ఎస్ అంశంలో భట్టి విక్రమార్క దాట వేశారు. ఎల్‌ఆర్ఎస్ ఉచితంగా చేయాలని మేము డిమాండ్ చేస్తే డబ్బులు చెల్లించాల్సిదేని భట్టి స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పెండింగ్ బిల్లులు క్లియర్ చేయలేదు. బీఆర్ఎస్ అప్పులపై లెక్కలు చూపించాలంటే పారిపోయారు. కాంట్రాక్టర్లు అంటే పెద్ద పీట .. ఉద్యోగులు అంటే చిన్నచూపు. మహాలక్ష్మి పథకం అమలు లేదు కానీ.. అందాల పోటీలు పెడుతున్నారు. ప్రభుత్వం దగ్గర మా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పారిపోయింది. సభలో అబద్ధాలు చెప్పి ప్రభుత్వం పారిపోయింది' హరీష్ విమర్శనాస్త్రాలు సంధించారు.

## లక్షల కోట్లు ఖర్చుపెట్టి ఏం చేశారు?

**ఈ-కబురు (హైదరాబాద్):** కేసీఆర్ సారథ్యంలోని భారాస ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అడ్డగోలుగా అప్పులు తెచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. గత పదేళ్లలో భారాస ప్రభుత్వం మొత్తం రూ.16.70లక్షల కోట్లు ఖర్చు చేసిందని.. ఆ మొత్తంతో ఏం నిర్మించారని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ప్రసంగించిన ఆయన భారాస పాలనా తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "రూ.16.70లక్షల కోట్లతో నాగార్జున సాగర్ నిర్మించారా? ఎస్ఆర్ఎస్పీ నిర్మించారా? ఓఆర్ఆర్ నిర్మించారా? ఎయిర్‌పోర్టు నిర్మించారా? కాళేశ్వరానికి మాత్రమే రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారు. అదీ కూలిపోయింది. సింగరేణికి రూ.77 వేల కోట్లు బకాయిలు పెట్టిపోయారు. పదేళ్లలో ఏ గ్రామంలోనైనా రెండు పడకగదుల ఇళ్లు నిర్మించారా? అసెంబ్లీ ఆమోదం లేకుండా రూ.2.30లక్షల కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని స్వయంగా కాగ్ వెల్లడించింది" అన్నారు. "గత ప్రభుత్వం ఏనాడూ నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదు. భారీగా బడ్జెట్ పెట్టినా నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదు. 2016 17లో రూ.8వేల కోట్లు, 201819లో రూ.40వేల కోట్లు, 202122లో రూ.48వేల కోట్లు, 2022 23లో రూ.52వేల కోట్లకు పైగా, 202324లో రూ.58,571 కోట్లు ఖర్చు చేయలేదు. ఓఆర్ఆర్‌ను రూ.7వేల కోట్లకే 30 ఏళ్ల కాలానికి అమ్ముకున్నారు. దొడ్డిదారిన ఓఆర్ఆర్, ప్రభుత్వ భూములను అమ్ముకున్నారు. తర్వాత వచ్చే ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయాన్ని కూడా ముందే తీసుకున్నారు. కేసీఆర్ నెరవేర్చని హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేశారు" అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## ..భాజపా ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు

మొదటి పేజి తరువాయి

ఇందులో బాధితులుగా ఉన్నారంటూ ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. దీనిపై శుక్రవారం కర్ణాటక అసెంబ్లీ దద్దరిల్లింది. సమావేశాల వేళ ప్రతిపక్ష భాజపా నేతలు ఈ అంశాన్ని లేవనెత్తడంతో తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. దాంతో సభా కార్యక్రమాలకు అడ్డుపడిన 18 మంది భాజపా ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తూ తీర్మానం చేశారు. ఆరు నెలల పాటు వారిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు.సంచలనంగా మారిన 'హనీ ట్రాప్' వ్యవహారాన్ని ఈ రోజు భాజపా నేతలు లేవనెత్తారు. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేశారు. హనీ ట్రాప్‌పై విచారణను పక్కనపెట్టి ప్రభుత్వం ముస్లిం కోటా బిల్లును పాస్ చేయడాన్ని విమర్శిస్తూ.. స్పీకర్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. భాజపా నేతల తీరుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకసారి కేసు నమోదై.. దర్యాప్తు ప్రారంభమైతే హనీట్రాప్‌లో ఎవరి ప్రమేయం ఉన్నట్లు తేలినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.రాష్ట్రానికి చెందిన అనేకమంది రాజకీయ నేతలు హనీ ట్రాప్‌లో చిక్కుకుపోయారని కర్ణాటక సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న ఇటీవల అసెంబ్లీలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు తెలిసినంతవరకు కనీసం 48 మంది ఇందులో బాధితులుగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో వారి అసభ్య వీడియోలు ఉన్నాయన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైన విషయం కాదన్నారు. అధికారపక్షం సహా విపక్షానికి చెందినవారు ఈ బాధితుల్లో ఉన్నారన్నారు. అంతకుముందు ఇదే అంశంపై మంత్రి సతీశ్ జార్కిహోళీ మాట్లాడుతూ.. ఒక మంత్రిపై రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే, ఇది రాష్ట్రానికి కొత్త కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారని పేర్కొన్నారు.ఇక, సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రకారం.. వేటుకు గురైన సభ్యులు అసెంబ్లీ హాల్, లాబీ, గ్యాలరీలోకి ప్రవేశించకూడదు. వారు ఏ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పాల్గొనకూడదు. అసెంబ్లీ ఎజెండాలో వారి పేర్లతో ఎలాంటి అంశం లిస్ట్ కాకూడదు. ఈ సమయంలో వారికి రోజూవారీ భత్యాలు కూడా అందవు. ఇక సస్పెండైన ఎమ్మెల్యేలను మార్షల్స్ బలవంతంగా బయటకు తరలించారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

## గచ్చిబౌలి డివిజన్ లో రూ.3.58కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నాం : ఎమ్మెల్యే గాంధీ**

**గచ్చిబౌలిని ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దడమే లక్ష్యం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి డివిజన్ పరిధిలో 3 కోట్ల 58 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు. నల్లగండ్ల ఎస్సి బస్తిలో 40 లక్షలతో సీసీ రోడ్లు, శ్రీ కృష్ణ కాలనీలో 45 లక్షలతో సీసీ రోడ్లు, టీఎన్జీవోస్ కాలనీలో 53.50 లక్షలతో సీసీ రోడ్లు, నానక్ రామ్ గుడలో 68 లక్షలతో సీసీ రోడ్లు, రాయదుర్గంలోని మంగళ బస్తి, ఎస్సి బస్తి, కట్టెల బస్తిలో 38 లక్షలతో సీసీ రోడ్లు, రాయదుర్గంలో 30 లక్షలతో సీసీ రోడ్లు, టెలికాంనగర్ కాలనీలో 84 లక్షలతో వరద నీటి కాలువ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు కోట్లాది రూపాయల నిధులతో పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని, రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకొని పోతూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ లోనే గచ్చిబౌలి డివిజన్ ను ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ సీనియర్ నాయకులు,కాలనీవాసులు, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు, అధికారులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రికా ప్రసాద్



**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకాన్ని శేరిలింగంపల్లి యువత సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ పిలుపునిచ్చారు. రాజీవ్ యువ వికాస పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు 3 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. దీనిలో కనీసం 60శాతం నుంచి 80 శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని అన్నారు. రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తు కోసం ఆధార్ కార్డు, అన్ని కులాల వారికి కులం మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అని తెలిపారు. పాన్ కార్డు, పాస్ పోర్ట్ ఫోటో, లబ్ధిదారుడి ఫోన్ నంబర్, బ్యాంకు పాస్ బుక్ కాపీతో ఏప్రిల్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు వ్యవసాయ రంగంలో ఎడ్ల బండ్లు, ఆయిల్ ఇంజిన్, పంప్ సెట్ , ఎయిర్ కంప్రెషర్, పత్తి సేకరణ యంత్రం, వేరుషనగ మిషన్, వర్మీ కంపోస్ట్, ఆయిల్ ఫామ్ పంటలపై, పశు పోషణ రంగాలపై ఆర్థిక సహాయం అందజేస్తారని అన్నారు. వ్యాపార రంగంలో చేతివృత్తుల దుకాణాలు, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, వస్త్ర, కిరాణా, మెడికల్ వంటి వ్యాపార సముదాయాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందజేస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకాన్ని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహకరించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గేలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అమెరికాతో సంప్రదింపులు జరుపుతున్నాం ట్రంప్ ప్రతీకార సుంకాలపై భారత్



**అమెరికాతో సుంకాలు, సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నామని భారత విదేశాంగ శాఖ పేర్కొంది.**

**ఢిల్లీ:** భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుంకాలు సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నామని భారత్ పేర్కొంది. ఇరువురికీ ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం కోసం ఓ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపింది. ట్రంప్ సుంకాల విధింపునకు మరో 11 రోజులే గడువున్న నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ ఈ విధంగా స్పందించింది.

''పరస్పరం ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా యంత్రాంగంతో వివిధ స్థాయిల్లో సంప్రదింపులు జరుపుతున్నాం. వీటిని ముందుకు తీసుకెళ్లే ప్రక్రియలో ఇరు దేశాలు నిమగ్నమై ఉన్నాయి. ద్వైపాక్షిక ఒప్పందానికి అవసరమైన ఫ్రేమ్‌వర్క్ రూపొందించడంపై రెండు ప్రభుత్వాలు చురుకుగా పని చేస్తున్నాయి. వాణిజ్యాన్ని విస్తరించడం, మార్కెట్ యాక్సెస్, సుంకాల తగ్గింపు, సప్లైచైన్ సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఇవి కొనసాగుతున్నాయి'' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

**ట్రంప్ హయాంలోనే.. భారీగా భారతీయుల 'డిపోర్టేషన్'!**

అయితే, ట్రంప్ హెచ్చరికలకు అనుగుణంగా భారత్ టారిఫ్‌లను తగ్గిస్తుందా? అన్న ప్రశ్నకు మాత్రం రణ్‌ధీర్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. చర్చలు కొలిక్కి వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని అన్నారు. అంతకు ముందురోజు ఇదే అంశంపై డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికా ఎగుమతులపై సుంకాలను భారత్ తగ్గిస్తుందనే నమ్ముతున్నానని అన్నారు. ఆ దేశంతో మంచి సంబంధాలే ఉన్నాయని.. అయినా ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలను విధించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ నేపథ్యంలోనే

# వాడిపోయిన ఆకుకూరలు... కుళ్లిపోయిన కూరగాయలు...

**దుర్గంధం వెదజల్లుతున్న కిచెన్**

**కొండాపూర్ సుబ్బయ్యగారి హోటల్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** నలుగురు స్నేహితులు కలిసినా... కుటుంబం జాలీగా బయటకు వెళ్లినా... తోటి ఉద్యోగులతో సరదాగా షీకారు చేయాలన్నా... నగరవాసులు వెళ్లేది మొదటగా ఏ రెస్టారెంటో, హోటల్ కో వెళతారు. ఇంట్లో వండిన వంటకాలను కాదని, బయట హోటళ్లలో లొట్టలేసుకుని తినే నగర వాసులకు పలు హోటళ్లలో కనిపిస్తున్న దృశ్యాలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. గతకొన్ని రోజులుగా నగరంలో ఉన్న పలు రెస్టారెంట్లు, హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు వరుసగా తనిఖీలు చేపడుతుండగా, పలు హోటళ్లలో అపరిశుభ్ర వాతావరణం. ఆరోగ్యాన్ని పాడుచేసే వస్తువులే దర్శనమిస్తున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపడుతున్నా నగరంలోని రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకుల్లో మార్పు రావడం లేదు. తనిఖీలు చేసినంత ఉత్సాహంగా నిబంధనలు పాటించని హోటళ్ల మీద చర్యలు తీసుకోకపోవడంతో హోటళ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా కొండాపూర్ లోని కాకినాడ సుబ్బయ్యగారి హోటల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే దృశ్యాలు కనిపించాయి. సుబ్బయ్యగారి హోటల్ అంటేనే మర్యాదకు, శుచి, శుభ్రతకు మారుపేరనే పేరుండగా, హోటల్లో పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. హోటల్ కిచెన్ మధ్యలో నుంచి ఓపెన్ డ్రైనేజీ కాలువను ఏర్పాటు చేయగా, అందులో తినుబండారాలు, చెత్త పేరుకుపోయి కిచెన్ మొత్తం తీవ్ర దుర్గంధబరితంగా కనిపించింది. సదరు డ్రైనేజీ నుంచి మురుగు నీరు పొంగిపొర్లుతుంది. కిచెన్ ఫ్లోరింగ్ మొత్తం పెచ్చులు ఊడిపోయి పగుళ్లు వచ్చినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పాటు కిచెన్ భద్రపరిచిన ఆకుకూరలు మొత్తం వాడిపోయి, ఎండిపోయి కనిపించాయి. ఫ్రిడ్జ్ లో ఉంచిన కూరగాయలు కుళ్లిన స్థితిలో దర్శనమిచ్చాయి. కిచెన్ పక్కనే ఉన్న స్టోర్ రూమ్ మొత్తం చిందరవందరగా, అపరిశుభ్రంగా ఉండడం అధికారులు గమనించారు. వీటితో పాటు వంట చేసే వారు ఎటువంటి హెడ్ క్యాప్ లు, చేతులకు గ్లౌస్ లు ధరించడం లేదని గుర్తించారు. హోటల్ కు ఉన్న లైసెన్సును ప్రదర్శించాల్సి ఉండగా, ఎక్కడా లైసెన్సు సైతం కనిపించలేదని అధికారులు తెలిపారు. హోటల్ వంటకాల్లో వాడుతున్న నూనెను స్వాధీనం చేసుకున్న అధికారులు టెస్టుల కోసం ల్యాబ్ కు పంపించినట్లు తెలిపారు. సదరు రిపోర్టులు వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కాగా సుబ్బయ్యగారి హోటల్ కిచెన్ లో ఉన్న అపరిశుభ్ర వాతావరణం దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



వాడిపోయిన ఆకుకూరలు



దుర్గంధబరితంగా ఉన్న కిచెన్ మధ్యలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ కాలువ

## అనుమానాస్పద స్థితిలో కార్పెంటర్ మృతి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** అనుమానాస్పద స్థితిలో ఓ కార్పెంటర్ మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ కు చెందిన జిందాల్ (50) భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఆరు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కొండాపూర్ మజీద్‌బండలో నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం కొండాపూర్ మజీద్ బండలో నిర్మాణంలో ఉన్న భవనంలో కార్పెంటర్ పనిచేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి కిందపడ్డాడు. తోటి కార్మికులు జిందాల్‌ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. దీంతో గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించాగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



పోలీసుల అదుపులో నిందితులు




నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్ లు

## మియాపూర్ లో దారి దోపిడీ

**డెలివరీ బాయ్ మీద దాడి చేసి డబ్బులు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన ఇద్దరు యువకులు**

**ఏఎంబీ మాల్ వద్ద నిందితులను అరెస్టు చేసిన పోలీసులు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** హైటెక్ సిటీ పరిధిలోని మియాపూర్ లో చోటు చేసుకున్న దారిదోపిడి సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తెల్లవారుజామున ఫుడ్ డెలివరీ బాయ్‌ను అడ్డగించిన ఇద్దరు వ్యక్తులు అతనిపై దాడి చేసి డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. బాధితుడు ఆలస్యంగా పోలీసులకు పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న మియాపూర్ పోలీసులు గచ్చిబౌలి పోలీసులతో కలిసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి పది సెల్‌ఫోన్లు, బంగారు రింగు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ జావీద్ సంవత్సరం క్రితం నగరానికి వచ్చి లంగర్‌హౌజ్‌లో నివాసం ఉంటూ జోమాటోలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 7వ తేదిన సాయంత్రం 7 గంటలకు తన హోండా షైన్ బైక్‌పై ఫుడ్ డెలివరీ చేసేందుకు రూం నుండి బయటకు వచ్చాడు. 8వ తేదిన తెల్లవారుజామున 3 గంటల సమయంలో మియాపూర్ గోకుల్ ప్లాట్స్‌లో ఉన్న బీహార్ బౌల్ హోటల్ నుండి ఫుడ్ తీసుకొని తన బైక్‌పై డెలివరీ చేసేందుకు బయలుదేరాడు. హోటల్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి జావీద్‌ను అడ్డుకున్నారు. గంజాయి అమ్ముతున్నవా... చెక్ చేయాలంటూ అడ్డగించారు. అనంతరం ఒక్కసారిగా హెల్మెట్ తో జావీద్‌పై దాడి చేసి అతని వద్ద ఉన్న ఐదు వేల నగదు, రెండు స్మార్ట్ ఫోన్లను లాక్కొని, ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తామని బెదిరించారు. దీంతో భయపడిపోయిన జావీద్ జరిగిన విషయాన్ని ఎవ్వరికి చెప్పకుండా అదే రోజు బీహార్‌కు వెళ్లిపోయాడు. తన సోదరుడు కనిపించడం లేదని నగరంలో ఉండే జావీద్ అన్న మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగిన వారం రోజుల తర్వాత జావీద్ హైదరాబాద్‌లో ఉన్న తన సోదరుడికి జరిగిన విషయం చెప్పడంతో వారు పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. జావీద్ నుండి వివరాలు సేకరించిన పోలీసులు దోపిడీకి పాల్పడిన నిందితులను శుక్రవారం కొండాపూర్ ఏఎంబీ మాల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. కూకట్ పల్లికి చెందిన ఆగమయ్య(19), జగద్గిరిగుట్టకు చెందిన అభిషేక్ (25)లను అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిద్దరి వద్ద పది సెల్ ఫోన్లు, గోల్డ్ రింగ్, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై గచ్చిబౌలి, మధురానగర్, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దొంగతనాల కేసులు ఉన్నాయి. గతంలో ఆగమయ్య మియాపూర్ పరిధిలో దొంతగతనం కేసులో అరెస్ట్ అయ్యాడని పోలీసులు తెలిపారు.




## సీబీఐ అదుపులో మరో అవినీతి తిమింగలం

**ఈ-కబురు హైదరాబాద్:** మరో అవినీతి తిమింగలం దొరికింది.మెదక్ జీఎస్టీ సూపరింటెంట్ రవి రాజన్ అగర్వాల్‌ను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జీఎస్టీ శాఖలో ఉన్నతాధికారిగా చెలామణి అవుతున్న రవి రాజన్ అగర్వాల్‌పై అవినీతి ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం మెదక్ జీఎస్టీ కార్యాలయంపై సీబీఐ అధికారులు దాడులు జరిపారు.సోదారులు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం, విచారణ నిమిత్త రవి రాజన్‌ను హైదరాబాద్‌కు తరలించారు.

## పునర్విభజన ఇప్పుడు జాతీయ ఉద్యమం.. వీడియో షేర్ చేసిన స్టాలిన్

**శనివారం చెన్నైలో జరగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ వీడియోను విడుదల చేశారు.**



**ఈ-కబురు:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంలోని భాజపాకు, పలు రాష్ట్రాల ప్రభుత్వాలకు మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో దీనిపై చర్చించేందుకు పలు రాష్ట్రాల నాయకులతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మార్చి 22న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి ముందు స్టాలిన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో జనాభా ప్రాతిపదికన విభజన జరిగితే రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు.

'జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరువుతున్న ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ , కేరళ, కర్ణాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ నాయకులకు నా హృదయపూర్వక స్వాగతం. మార్చి 5న జరిగిన అఖిలపక్ష సమావేశం ఒక మైలురాయి. 2026 ఏడాదిలో జరిగే పునర్విభజన జనాభా ప్రాతిపదికన జరిగితే పార్లమెంటులో మన ప్రాతినిథ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఇది కేవలం ఎంపీల సంఖ్య గురించి మాత్రమే కాదు.. రాష్ట్ర హక్కుల భంగం గురించి. అందుకే దీనిపై భాజపా తప్ప మిగిలిన పార్టీలన్నీ ఏకమయ్యాయి. తమిళనాడులోని 58 పార్టీలు సైతం విభేదాలను పక్కనపెట్టి సముచితమైన పునర్విభజనకు ఒక్కటయ్యాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను తొలుత తమిళనాడు వ్యతిరేకించింది. దీనికి అన్ని రాష్ట్రాలు చేతులు కలపడంతో ప్రస్తుతం ఇది ఒక జాతీయ ఉద్యమంగా మారింది' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా శనివారం జరిగే సమావేశం దేశ భవిష్యత్తును రూపొందించే ఉద్యమానికి నాంది అని ఆయన అభివర్ణించారు.

**పార్లమెంటును స్తంభింపజేసిన టీ-షర్టులు**

ఈనెల 5న స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో అఖిలపక్ష సమావేశం జరిగింది. అందులో పునర్విభజనను ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నట్లు అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. పార్లమెంటు సభ్యుల సంఖ్యను పెంచే పక్షంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇరు సభల్లో రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈక్రమంలో పునర్విభజన వల్ల జరిగే నష్టాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించేందుకు కలిసి రావాలని ఏడు రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖలు రాశారు. ఈనెల 22న చెన్నైలో నిర్వహించే సమావేశానికి ప్రతినిధులను పంపాలని ఆయన అందులో కోరారు.




# జియో కొత్త ప్లాన్.. 336 రోజుల వ్యాలిడిటీ

రిలయన్స్ జియో తన యూజర్ల కోసం 11 నెలల ప్లాన్ వెల్లడించింది. కేవలం 895 రూపాయలు రీఛార్జ్ చేసుకోవడం ద్వారా.. 330 రోజుల కంటే ఎక్కువ అపరిమిత కాల్స్, లిమిటెడ్ ఎస్ఎమ్ఎస్ & డేటా వంటి వాటిని పొందవచ్చు. ఈ ప్లాన్ గురించి పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం. ఒకసారి రూ. 895తో రీఛార్జ్ చేస్తే.. రోజుకు దాదాపు మూడు రూపాయల కంటే తక్కువ ఖర్చు చేసినట్లు అవుతుంది. 11 నెలలు (336 రోజులు) అపరిమిత కాల్స్ కాకుండా.. 600 ఎస్ఎమ్ఎస్‌లు, 24 జీబీ డేటా లభిస్తుంది. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఈ ప్లాన్ కేవలం జియో ఫోన్ ఉన్నవారికి మాత్రమే. స్మార్ట్‌ఫోన్ యూజర్లు ఈ ప్లాన్‌ను ఉపయోగించుకోలేరు.

**ఎస్ఎమ్ఎస్‌లు & డేటా వివరాలు**

ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే.. 28 రోజుల పాటు 50 ఉచిత ఎస్ఎమ్ఎస్‌లను అందిస్తుంది. అంటే నెలకు 50 ఎస్ఎమ్ఎస్‌లు మాత్రమే లభిస్తాయి. ఆలా 12 సార్లు 50 ఉచిత ఎస్ఎమ్ఎస్‌లను పొందవచ్చు. డేటా విషయానికి వస్తే.. ఈ ప్లాన్ మొత్తానికి 24 జీబీ డేటా మాత్రమే లభిస్తుంది. ఎక్కువ డేటా అవసరం లేదు అనుకున్నవారికి ఈ ప్లాన్ ఉపయోగపడుతుంది. సాధారణ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు 336 రోజులు యాక్టివ్‌గా ఉండడానికి రూ.1748 ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకోవచ్చు.

**రూ.1748 ప్లాన్ ప్రయోజనాలు**

జియో రూ.1748 ప్లాన్‌లో.. వినియోగదారులు అపరిమిత వాయిస్ కాలింగ్, 3600 ఎస్ఎమ్ఎస్‌లు పొందుతారు. ఈ ప్లాన్‌లో జియోటీవీ, జియోక్లౌడ్ ప్రయోజనాలు ఉన్నాయి. ఈ ప్లాన్‌లో కాలింగ్, ఎస్ఎమ్ఎస్ వంటివాటితో పాటు డేటా కూడా లభిస్తుంది.



# మళ్లీ మంచి లాభాలు.. స్టాక్ మార్కెట్‌కు ఇదే బెస్ట్ వీక్!

**దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మళ్లీ మంచి లాభాలతో ముగిశాయి. బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు ర్యాలీని వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్‌కు పొడిగించాయి. ఈ ప్రక్రియలో నాలుగేళ్లలో బెస్ట్ వీక్‌ను నమోదు చేశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 77,042 వద్ద గరిష్టానికి చేరుకుంది. చివరికి 557 పాయింట్ల లాభంతో 76,906 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ బెంచ్మార్క్ ఈ వారంలో 3,077 శాతం లేదా 4.17 పాయింట్లు పెరిగింది.**

నిఫ్టీ 160 పాయింట్ల లాభంతో 23,350 వద్ద ముగిసింది. నిఫ్టీ ఈ వారం 4.26 శాతం లేదా 953 పాయింట్లు పెరిగింది. 2021 ఫిబ్రవరి 7 తర్వాత ఇది గరిష్ట వారపు లాభం. సెన్సెక్స్ 30 షేర్లలో ఎన్టీపీసీ శుక్రవారం అత్యధికంగా 3.3 శాతం లాభపడింది. అదేసమయంలో బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, లార్సెన్ అండ్ టుబ్రో, కోటక్ బ్యాంక్, నెస్లే ఇండియా, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు కూడాలాభాల్లో ముగిశాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా అత్యధికంగా 1 శాతానికి పైగా పడిపోయింది. టాటా స్టీల్, ఇన్ఫోసిస్, టైటాన్, బజాజ్ ఫిన్సర్వ్ షేర్లు కూడా నష్టాలను చూశాయి. విస్తృత మార్కెట్లో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1 శాతానికి పైగా, స్మాల్‌క్యాప్ 2 శాతానికి పైగా లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే బీఎస్ఈ ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగింది. పవర్, హెల్త్ కేర్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్‌లు లాభపడ్డాయి. మరోవైపు బీఎస్ఈ కన్జ్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 0.8 శాతం, మెటల్ ఇండెక్స్ 0.4 శాతం నష్టపోయాయి




# ఐపీఎల్ మజా.. ఎయిర్‌టెల్ కొత్త ప్లాన్లు

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ప్రారంభం నేపథ్యంలో ప్రముఖ టెలికం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో రెండు కొత్త డేటా వోచర్లను ప్రవేశపెట్టింది. రూ.100, రూ.195 ధర కలిగిన ఈ కొత్త ప్లాన్లు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్‌తోపాటు అదనపు డేటా కోసం చూస్తున్న వినియోగదారులకు ఉపయోగపడతాయి. ఈ వోచర్లను ఇప్పటికే ఉన్న ప్రీపెయిడ్ ప్లాన్ పైన రీఛార్జ్ చేసుకోవచ్చు.**

**రూ.100 డేటా వోచర్**

ఎయిర్‌టెల్ రూ .100 డేటా వోచర్ 5 జీబీ అదనపు డేటాతో పాటు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్‌ను 30 రోజుల పాటు అందిస్తుంది. ఐపీఎల్ 2025 మ్యాచ్‌లను ప్రయాణంలో లేదా మొబైల్ ఫోన్ లేదా టాబ్లెట్లో చూడాలనుకునే వినియోగదారులకు ఈ ప్లాన్ అనువైనది.

**రూ.195 డేటా వోచర్**

ఎయిర్‌టెల్ రూ .195 డేటా వోచర్ 15 జీబీ డేటా, 90 రోజుల వ్యాలిడిటీతో జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్‌ను అందిస్తుంది. ఎక్కువ వ్యాలిడిటీ, అధిక డేటాతోపాటు జియో హాట్‌స్టార్ కంటెంట్ యాక్సెస్ కావాలనుకునే యూజర్లకు ఈ ప్లాన్ సరిపోతుంది.

**ఇతర జియో హాట్‌స్టార్ ప్లాన్లు**

జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో మరికొన్ని ప్రీపెయిడ్ ప్లాన్లను కూడా ఎయిర్‌టెల్ అందిస్తోంది. రూ.3,999, రూ.1,029, రూ.549, రూ.398 విలువైన ఈ ప్లాన్లు సర్వీస్ వ్యాలిడిటీ, అధిక డేటా పరిమితులు, అదనపు బెనిఫిట్స్ వంటి వివిధ ప్రయోజనాలను అందిస్తున్నాయి.

## ఏప్రిల్ 1 నుంచి ఈ నంబర్లకు యూపీఐ సేవలు బంద్..

# యూజర్లేం చేయాలి?

**ఏప్రిల్ 1 నుంచి కొన్ని మొబైల్ నంబర్లకు యూపీఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఎన్‌పీసీఐ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది.**




ఇన్‌యాక్టివ్ లేదా వేరే వారికి కేటాయించిన మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యూపీఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు బ్యాంకులు, పేమెంట్ సేవలందించే ప్రొవైడర్లకు.. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసింది. అనధికారిక వాడకాన్ని, మోసాలను అరికట్టేందుకు ఆ నంబర్లను డీయాక్టివేట్ చేయాలని సూచించింది. యూపీఐ వినియోగంలో మొబైల్ నంబర్ కీలకం. ఈ సేవల్లో ఓటీపీ వెరిఫికేషన్ కీలక భూమిక పోషిస్తుంది. అందుకే ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది.

ఎక్కువకాలం పాటు వినియోగంలో లేని మొబైల్ నంబర్లను టెలికాం కంపెనీలు వేరొకరికి కేటాయిస్తుంటాయి. దీంతో దీర్ఘకాలం పాటు మనం వాడే నంబర్లు వేరొకరికి చేరుతుంటాయి. దాంతో యూపీఐ ఖాతాలు కూడా వారి చేతిలోకి వెళ్లే అవకాశం ఉంది. దీనివల్ల అనధికారిక, మోసపూరిత లావాదేవీలు జరిగే అవకాశం ఉంది. వీటిని నివారించేందుకు ఎన్‌పీసీఐ ఆదేశాల మేరకు గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్స్‌తో పాటు బ్యాంకులు ఇన్‌యాక్టివ్ నంబర్లను తొలగించనున్నాయి.

**ఏం చేస్తారు?**

ఇన్‌యాక్టివ్‌లో ఉన్న, ఇతరులకు అసైన్ చేసిన, డీయాక్టివ్ చేసిన మొబైల్ నంబర్లు బ్యాంకులు, పేమెంట్ ప్రొవైడర్లు తొలగిస్తాయి. ఒకవేళ అందులో మీ నంబర్ ఉంటే.. యూపీఐ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు నోటిఫికేషన్ పంపిస్తాయి. నోటిఫికేషన్ తర్వాత కూడా నంబర్ ఇన్‌యాక్టివ్‌లోనే ఉంటే మోసాలను అరికట్టేందుకు యూపీఐ నంబర్లను బ్యాంకులు డీలిస్ట్ చేస్తాయి.

**ఎవరిపై ప్రభావం?**

మొబైల్ నంబర్ మార్చినా బ్యాంకుల వద్ద ఆ నంబర్‌ను అప్‌డేట్ చేయని వారి మీద ప్రభావం ఉంటుంది.

యూపీఐతో లింక్ చేసి కాల్స్, ఎస్సెమ్మెస్‌లు వంటివేవీ చేయకుండా దీర్ఘకాలం పక్కనపెట్టిన వారు

బ్యాంకు వివరాలను అప్‌డేట్ చేయకుండా మొబైల్ నంబర్‌ను సరెండర్ చేసినవారు అవాంతరాలు ఎదుర్కొంటారు.




**పాత నంబర్‌ను వేరొకరికి అసైన్ చేసిన సందర్భాల్లో పాత నంబర్ హోల్డర్లపై ఈ ప్రభావం ఉంటుంది.**

యూపీఐని యాక్టివ్‌గా ఉంచుకోవాలంటే?

మీ నంబర్ యాక్టివ్‌గా ఉందో, లేదో చెక్ చేసుకోండి. కాల్స్, మెసేజులు వెళ్తున్నాయో, లేదో చూడండి.

బ్యాంక్ నుంచి ఓటీపీలు, ఎస్సెమ్మెస్ అలర్ట్‌లు వస్తున్నాయో, లేదో చెక్ చేసుకోండి. బ్యాంకుల వద్ద మీ మొబైల్ నంబర్‌ను అప్‌డేట్‌గా ఉండేలా చూసుకోండి. నెట్‌బ్యాంకింగ్ లేదా బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లి ఈ ప్రక్రియను పూర్తి చేయొచ్చు.

# తగ్గిన బంగారం ధరలు





**మూడు రోజుల ధరల పెరుగుదల తరువాత.. గోల్డ్ రేటు ఉన్నట్టుంది తగ్గింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా పసిడి ధరలలో మార్పులు జరిగాయి. ఈ కథనంలో ఏ ప్రాంతంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయనే వివరాలను తెలుసుకుందాం.**

హైదరాబాద్, విజయవాడలలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 82,700 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 90,220 వద్ద నిలిచాయి. నిన్న రూ. 200, రూ. 220 పెరిగిన గోల్డ్ రేటు.. ఈ రోజు రూ. 400 (22 క్యారెట్స్ 10గ్రా), రూ. 440 (24 క్యారెట్స్ 10గ్రా) తగ్గింది. ఇదే ధరలు గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో కూడా కొనసాగుతాయి.

చెన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ. 400, రూ. 440 తగ్గింది. దీంతో ఇక్కడ 10గ్రా 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 82,700 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 90,220 వద్ద ఉంది. దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు రూ. 82,850 (10గ్రా 22 క్యారెట్స్), రూ. 90,370 (10గ్రా 24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 400, రూ. 440 ఎక్కువ. అంతే కాకుండా.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఢిల్లీలో గోల్డ్ రేటు కొంత ఎక్కువగానే ఉంది.

**వెండి ధరలు**

బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ రోజు (మార్చి 21) కేజీ సిల్వర్ రేటు రూ. 1,12,100 చేరింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు ఒకేవిధంగా ఉన్నప్పటికీ.. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి రేటు రూ. 1,03,000 వద్దకు చేరింది.




## 5జీ యూజర్లు ఎందరంటే..

**2028 నాటికి నోకియా అంచనా**

**న్యూఢిల్లీ:** దేశీయంగా 5జీ యూజర్ల సంఖ్య వచ్చే మూడేళ్లలో (2028 నాటికి) 2.65 రెట్లు పెరగనుంది. 77 కోట్లకు చేరనుంది. అలాగే, నెలవారీ డేటా వినియోగం యూజర్‌కు సగటున 40 జీబీ స్థాయికి చేరుతుందని టెలికం పరికరాల తయారీ సంస్థ నోకియా ఓ నివేదికలో అంచనా వేసింది. గత అయిదేళ్లలో 2024 నాటికి 4జీ, 5జీ డేటా వినియోగం వార్షికంగా 19.5% పెరిగి 27.5 జీబీకి చేరిందని పేర్కొంది.

గతేడాది 5జీ డేటా ట్రాఫిక్ మూడు రెట్లు పెరిగినట్లు వివరించింది. 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ లభ్యత (ఎఫ్‌డబ్ల్యూఏ) పెరుగుతుండటంతో డేటా వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోందని నోకియా ఇండియా టెక్నాలజీ, సొల్యూషన్స్ హెడ్ సందీప్ సక్సేనా తెలిపారు. యాక్టివ్ 5జీ డివైజ్‌ల సంఖ్య వార్షికంగా రెట్టింపై 2024లో 27.1 కోట్లకు చేరినట్లు తెలిపారు.

# టెస్లా కార్లకు సప్లయర్ 'టాటా'నే!





**ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) కంపెనీ టెస్లాకు గ్లోబల్ సప్లయర్‌గా టాటా గ్రూప్ నిలిచింది. ఈమేరకు ఎకనామిక్ టైమ్స్ నివేదించింది. ఈ భాగస్వామ్యం ప్రపంచ ఎలక్ట్రిక్ వాహన రంగంలో పెరుగుతున్న భారత్ పాత్రను, అధునాతన తయారీ, సాంకేతికతలో టాటా గ్రూప్ నైపుణ్యాన్ని నొక్కి చెబుతోంది.**

ఈ నివేదిక ప్రకారం.. టాటా ఆటోకాంప్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , టాటా టెక్నాలజీస్ , టాటా ఎలక్ట్రానిక్స్‌తో సహా అనేక టాటా గ్రూప్ కంపెనీలు ఇప్పుడు టెస్లా సరఫరా గొలుసులో భాగంగా ఉన్నాయి. కీలకమైన భాగాలు, సేవలను అందిస్తున్నాయి. ఈ టాటా సంస్థలు ఇప్పటికే టెస్లాతో అంతర్జాతీయ ఒప్పందాలు కుదుర్చుకున్నాయని, వివిధ విడిభాగాలు, సేవలను సరఫరా చేస్తున్నాయని ఈటీ నివేదించింది. ముఖ్యంగా టెస్లా భారత్‌లో తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తే వారి భాగస్వామ్యం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

టెస్లా సీనియర్ ప్రొక్యూర్మెంట్ అధికారులు నిర్దిష్ట విడిభాగాల తయారీ గురించి భారతీయ సరఫరాదారులతో చర్చలు జరుపుతున్నారని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ ఈటీ పేర్కొంది. వీటిలో కాస్టింగ్స్, ఫోర్జింగ్స్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాబ్రికేషన్ భాగాలు ఉన్నాయి. టెస్లాకు భారతీయ సప్లయర్ల సహకారం ఇప్పటికే గణనీయంగా ఉంది. 2024 ఆర్థిక సంవత్సరంలో భారతీయ కంపెనీలు టెస్లాకు దాదాపు 2 బిలియన్ డాలర్ల విలువైన విడిభాగాలను సరఫరా చేశాయి. టెస్లా తన సరఫరా గొలుసును వైవిధ్యపరచాలని చూస్తున్న క్రమంలో భారత్ నుంచి దాని సోర్సింగ్ పెరుగుతుందని భావిస్తున్నారు.

**టాటా కంపెనీలు ఏం సరఫరా చేస్తున్నాయంటే..**

ఈటీ కథనం ప్రకారం.. వివిధ టాటా గ్రూప్ కంపెనీలు టెస్లాకు ప్రత్యేక ఉత్పత్తులు, సేవలను అందిస్తున్నాయి. వాటిలో టాటా ఆటోకాంప్ ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఇంజనీరింగ్ ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. టాటా టెక్నాలజీస్ ఎండ్‌టుఎండ్ ప్రొడక్ట్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ అందిస్తోంది. టీసీఎస్ సర్క్యూట్ బోర్డు టెక్నాలజీని అందిస్తోంది.

టెస్లా తయారీ యూనిట్ ఇక్కడ ఏర్పాటయ్యాక టాటా ఎలక్ట్రానిక్స్ సెమీకండక్టర్ చిప్‌లను సరఫరా చేస్తుందని భావిస్తున్నారు. ఇక బ్యాటరీ మేనేజ్మెంట్ సిస్టమ్స్, మోటార్ కంట్రోలర్ యూనిట్లు, డోర్ కంట్రోల్ మెకానిజమ్‌కు కీలకమైన ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ అసెంబ్లింగ్స్ (పీసీబీఏ) కోసం టెస్లా టాటా ఎలక్ట్రానిక్స్ వైపు చూడవచ్చు.

## ఆ ప్రాంతాల్లో స్టూడియోలు నిర్మించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరాం: టీఎఫ్‌పీసీ




ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధిపై తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి స్పందించింది. ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు చేసినట్లు తెలిపింది.

ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధిపై తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి (టీఎఫ్‌పీసీ) స్పందించింది. సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కొత్త విధానాన్ని తీసుకురావాలన్న ఏపీ ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది. సినీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు చేసినట్లు నిర్మాతల మండలి సభ్యులు తెలిపారు. విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరంలో స్టూడియోలు నిర్మించాలని కోరినట్లు చెప్పారు. అదే విధంగా దర్శక నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణుల ఇళ్ల కోసం భూములు కేటాయించాలని విన్నవించామన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వానికి తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. నంది అవార్డులను పునరుద్ధరించాలని.. పెండింగ్‌లో ఉన్న అవార్డులను కూడా అందించాలని కోరామని.. ఈ విషయంపై ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని వెల్లడించారు.



## బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌పై ఆర్జీవీ రియాక్షన్ ఇదే!

''సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలు షేర్ చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది? అనే నేపథ్యంలో 'శారీ' రూపొందింది. నేనీ చిత్రానికి మూల కథ రాశాను. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. 'శారీ'లో సందేశం ఉంటుందని చెప్పను గానీ, ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు'' అని రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. సత్య యాదు, ఆరాధ్యా దేవి ప్రధాన పాత్రల్లో గిరి కృష్ణ కమల్ దర్శకత్వం వహించిన చిత్రం 'శారీ'.

బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినవారిపై కేసులు పెట్టడంపై స్పందిస్తూ.. తాము చేస్తున్న యాడ్స్ లీగలా? కాదా? అనేది యాక్టర్స్‌కు, స్టార్స్‌కు తెలియక పోవచ్చు. దానిపై అధికారులు నటీనటులకు అవగాహన కల్పించాలి. అంతేగానీ సడెన్‌గా చర్యలు తీసుకోవడం సరికాదు'' అన్నారు. ''ఆరాధ్య, సత్య బాగా నటించడం వల్ల దర్శకుడిగా నాపై ఒత్తిడి తగ్గింది'' అని గిరి కృష్ణకమల్ చెప్పారు. ''ఈ సినిమాలో నా పాత్ర చిన్నదే అయినా కథలో కీలకంగా ఉంటుంది'' అని సత్య యాదు తెలిపారు.




## పర్మిషన్ లేకుండా కారవాన్‌లోకి..

### దర్శకుడిపై కేకలు వేశా: షాలినీ పాండే

**'అర్జున్‌రెడ్డి'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు నటి షాలినీ పాండే . కెరీర్ పరంగా తనకు ఎదురైన ఇబ్బందుల గురించి తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.**

'అర్జున్ రెడ్డి' తో కెరీర్ ఆరంభంలోనే విజయాన్ని అందుకున్నారు నటి షాలినీ పాండే . ఈ సినిమా తర్వాత ఆమె తెలుగు, తమిళంలో పలు సినిమాలు చేశారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్ట్‌లు చేస్తోన్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. కెరీర్ ఆరంభంలో ఒక దర్శకుడి తీరు వల్ల తాను ఇబ్బందిపడినట్లు చెప్పారు. అతడిపై తాను కేకలు వేశానని తెలిపారు. ఆ సమయంలో అలా చేసి మంచి పనే చేశానని వెల్లడించారు.

''జబల్‌పుర్‌కు చెందిన నేను.. సినిమాల్లో రాణించాలనే ఆశతో కుటుంబాన్ని వదిలేసి వచ్చాను. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఫేస్‌బుక్‌లో నా ఫొటోలు చూసి 'అర్జున్ రెడ్డి'లో అవకాశం ఇచ్చారు. ఆయన టీమ్ నుంచి నాకు ఫోన్ వచ్చినప్పుడు నిజమేనా? కాదా? అని కూడా ఆలోచించలేదు. ఫొటోలు అడిగారు పంపించేశాను. అలా, 'అర్జున్ రెడ్డి'తో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నా. ఇన్నేళ్ల ప్రయాణంలో దర్శకనిర్మాతలు, నటీనటులు నాకెంతో సపోర్ట్‌గా నిలిచారు. ఆయా సినిమాలకు సంబంధించి నా అభిప్రాయాలనూ వారు గౌరవించారు. అయితే, ఈ ప్రయాణంలో నేనూ సవాళ్లు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. కెరీర్ ఆరంభంలో దక్షిణాదిలో ఓ సినిమా చేస్తున్నప్పుడు.. దర్శకుడి ప్రవర్తన వల్ల ఇబ్బందిపడ్డా. కారవాన్‌లో నేను దుస్తులు మార్చుకుంటున్న సమయంలో పర్మిషన్ లేకుండానే దర్శకుడు డోర్ తీశాడు. నాకెంతో కోపం వచ్చింది. వెంటనే ఆయనపై కేకలు వేశా. దాంతో ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయాడు. చుట్టూ ఉన్న వాళ్లు అలా ఆగ్రహం వ్యక్తం చేయడం కరెక్ట్ కాదన్నారు. నాకు మాత్రం తప్పుగా అనిపించలేదు. ఆ తర్వాత నాకెప్పుడూ ఆ విధమైన సమస్యలు ఎదురుకాలేదు. ఒకవేళ ఎదురైనా ముఖంపైనే కోప్పడకుండా వారికి ఏవిధంగా సమాధానం చెప్పాలో తెలుసుకున్నా'' అని షాలినీ పాండే వివరించారు.

షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సిరీస్ చిత్రీకరణ సందర్భంగా షబానా అజ్మీ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని అన్నారు. సీనియర్ నటి అయినప్పటికీ ఆమె అందరితో కలివిడిగా ఉంటారని.. స్ఫూర్తినింపేలా మాట్లాడతారని చెప్పారు. కెరీర్ పరంగా తాను విభిన్నమైన ప్రాజెక్ట్‌లు.. సవాలు చేసే పాత్రల్లో నటించాలని ఉందని షాలినీ పాండే తెలిపారు.

## డిటెక్టివ్-2 తర్వాత మరో ప్రాజెక్ట్‌కు విశాల్ గ్రీన్ సిగ్నల్



కోలీవుడ్ నటుడు విశాల్ జయాపజయాలకు అతీతుడనే చెప్పాలి. 2023లో మార్క్ ఆంటోనీ వంటి సూపర్ హిట్ చిత్రాన్ని ఇచ్చిన విశాల్ ఆ తర్వాత నటించిన రత్నం చిత్రం 2024లో విడుదలై పూర్తిగా నిరాశపరిచింది. అయితే ఆ లోటు భర్తీ చేసే విధంగా గత 12 ఏళ్ల క్రితం కథానాయకుడుగా నటించిన మదగజరాజా చిత్రం 2025 సంక్రాంతి సందర్భంగా విడుదలై సంచలన విజయాన్ని సాధించింది. ప్రస్తుతం విశాల్ డిటెక్టివ్-2 చిత్ర రూపకల్పనలో బిజీగా ఉన్నారు. ఇందులో కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు.

అదేవిధంగా గౌతమ్‌మీనన్ దర్శకత్వంలో నటించే చిత్రం గురించి చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈయన మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తాజా సమాచారం. ఇంతకుముందు ఈటీ, ఐంగరన్ చిత్రాల ఫేమ్ రవి అరసు దర్శకత్వంలో నటించడానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. ఈ క్రేజీ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన పూర్తి వివరాలతో త్వరలో వెలువడే అవకాశం ఉంది.

అయితే విశాల్ ముందుగా గౌతమ్‌మీనన్ దర్శకత్వంలో నటిస్తారా, లేక రవి అరసు దర్శకత్వంలో నటిస్తారా అన్న విషయం కూడా తెలియాల్సి ఉంది. ఏదేమైనా ప్రస్తుతం విశాల్ స్వీయ దర్శకత్వంలో కథానాయకుడిగా నటిస్తున్న డిటెక్టివ్ -2 చిత్రం తర్వాతే మరో చిత్రంలో నటించే అవకాశం ఉంది. ఇకపోతే ఇటీవల విశాల్ అనారోగ్యానికి గురికావడంతో ఆయనపై రకరకాల ట్రోల్స్ చేశారు. అయితే చాలా త్వరగా రికవరీ అయిన విశాల్ మళ్లీ షూటింగ్తో బిజీ కావడం ద్వారా తన గురించి కామెంట్ చేసిన వారికి స్ట్రాంగ్‌గా బదులు ఇచ్చారనే చెప్పాలి.



## సినిమా లేదు.. హిట్ లేదు.. అయినా: సమంత ఎమోషనల్

అభిమానుల ప్రేమను కొనియాడారు నటి సమంత . వారి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని గుర్తు చేసుకున్నారు.

అభిమానులు తనపై చూపిస్తోన్న ప్రేమకు ధన్యవాదాలు చెప్పారు నటి సమంత . వారి ప్రేమ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానంటూ భావోద్వేగానికి గురయ్యారు. చెన్నై వేదికగా ఇటీవల జరిగిన బిహైండ్‌వుడ్స్ అవార్డుల వేడుకలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 2010 నుంచి స్ఫూర్తిదాయక పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్నందుకు ఆమెను కె.బాలచందర్ హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డుతో సత్కరించారు. అవార్డు అందుకున్న అనంతరం ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.''ఈ అవార్డు అందుకున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. కె.బాలచందర్ సర్ పేరుతో ఈ అవార్డు అందుకోవడం చాలా ప్రత్యేకం. ఆయన ఎన్నో అద్భుతమైన పాత్రలను మనకు పరిచయం చేశారు. ఆయన తెరకెక్కించిన చిత్రాల్లో స్త్రీ పాత్రలు ఎంతో సహజంగా ఉంటాయి. ఆయన సినిమాల నుంచి నేనెంతో స్ఫూర్తి పొందా. ఈరోజు నా జీవితం పరిపూర్ణమైనట్లు అనిపిస్తుంది. ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేసినవారందరికీ ధన్యవాదాలు. సాధారణంగా ఒక సినిమా హిట్ అయితే మనల్ని ప్రేమించేవారు ఉంటారు. కానీ, రెండేళ్లు అయింది ఒక్క తమిళ సినిమా చేయలేదు. ఈ మధ్యకాలంలో హిట్ అందుకోలేదు. అయినా నాపై మీ ప్రేమ ఏమాత్రం తగ్గలేదు. మీ ప్రేమను చూస్తుంటే నాకు మాటలు రావడం లేదు. ఇంత ప్రేమ పొందేందుకు నేనేం చేశానో కూడా నాకు తెలియదు. మీరు లేకుండా నేను లేను'' అని ఆమె చెప్పారు. అభిమానులు డ్యాన్స్ చేయమని కోరగా.. తాను ఇప్పుడే యాక్షన్ సీక్వెన్స్ చేసి వచ్చానని.. డ్యాన్స్ చేయలేనని తెలిపారు. అభిమానుల ప్రేమకు రుణపడి ఉంటానని అన్నారు.చెన్నైకు చెందిన సమంత 'ఏమాయ చేసావె'తో నటిగా తెరంగేట్రం చేశారు. కెరీర్ ఆరంభం నుంచి ఆమె తెలుగుతోపాటు తమిళంలోనూ వరుస సినిమాలు చేసి స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. 2022లో విడుదలైన 'కాతు వక్కుల రెండు కాదల్' తర్వాత ఆమె తమిళంలో ఏ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్ప లేదు. సమంత కొంతకాలంగా సినిమాల్లోనే కాకుండా సిరీస్‌ల్లోనూ యాక్ట్ చేస్తున్నారు. ఇటీవల ఆమె 'సిటడెల్ హనీ బన్నీ'తో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం ఆమె చేతిలో 'రక్త్ బ్రహ్మాండ్', 'మా ఇంటి బంగారం' చిత్రాలు ఉన్నాయి. ఆమె నిర్మాతగా వ్యవహరించిన 'శుభం' త్వరలో విడుదల కానుంది.

## ఈ ప్రయాణం కష్టమే.. కానీ: SSMB29పై కీరవాణి ఆసక్తికర వ్యాఖ్యలు



**తాను సంగీతం అందిస్తున్న సినిమాలు, కాన్సర్ట్ గురించి ఎం.ఎం. కీరవాణి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.**

మహేశ్ బాబు హీరోగా దర్శకుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న (వర్కింగ్ టైటిల్)పై ఎం.ఎం. కీరవాణి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి వరకూ తాను పని చేసిన వాటిల్లో ఇది కష్టమైన ప్రాజెక్టు అని తెలిపారు. ''ప్రతి సినిమాకీ సవాళ్లు పెరుగుతూనే ఉంటాయి. దానికి తగ్గట్టు కొత్త సౌండ్స్ సృష్టించాలి. ఇంతకు ముందెన్నడూ ఇలాంటి మూవీ (ఎస్ఎస్ఎంబీ 29ని ఉద్దేశిస్తూ) రాలేదని అనుకుంటున్నా. ఇదొక అడ్వెంచర్. కష్టమే అయినా ఆసక్తికర ప్రయాణమది'' అని పేర్కొన్నారు. 'నా టూర్ ఎం.ఎం.కె' పేరిట ఈ నెల 22న తాను నిర్వహించనున్న కాన్సర్ట్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ విషయాలు పంచుకున్నారు. ప్రస్తుతం సంగీతం అందిస్తున్న ఇతర ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ.. ''దాదాపు మూడు దశాబ్దాల తర్వాత చిరంజీవితో 'విశ్వంభర' చిత్రానికి పని చేస్తున్నా. బాలీవుడ్‌లో 'తన్వి: ది గ్రేట్'కి స్వరాలు సమకూరుస్తున్నా. నటుడు అనుపమ్ ఖేర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమది'' అని తెలిపారు.

**ప్రతి ఒక్కరి నుంచి నేర్చుకుంటా**

''సంగీతం విషయంలో కేవీ మహదేవన్, ఆర్.డి. బర్మన్ ప్రభావం నాపై ఎంతగానో ఉంది. అయితే, వాళ్లిద్దరే కాదు కొత్తగా ప్రయత్నించే ప్రతి సంగీత దర్శకుడి నుంచి నేను నేర్చుకుంటూ ఉంటా. సంగీత వాయిద్యాల్లో పియానో నాకు చాలా ఇష్టం'' అని చెప్పారు.

**ఈసారి అంతకుమించి..**

''బడ్జెట్ కారణంగా ఇంతకు జరిగిన ఈవెంట్లలో తక్కువ మందితో పెర్ఫామెన్స్ ఇచ్చేవాడిని. కానీ, ఈసారి 150 మందితో కాన్సర్ట్ ఉండనుంది. సినిమాల్లో 1600కుపైగా పాటలకు కంపోజ్ చేశా. వాటిలో 800 సాంగ్స్ హిట్స్. 400 పాటలు సూపర్‌హిట్స్. 200 గీతాలు మెగాహిట్. కాన్సర్ట్ కోసం వీటిలో 30కిపైగా ఎంపిక చేశాం. మెలొడీ, హుషారెత్తించే గీతాలూ అందులో ఉంటాయి'' అని అన్నారు.




## ఐపీఎల్.. ఈ రికార్డు బద్దలవుతుందా?

**ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు విరాట్ కోహ్లీదే. ఈ రికార్డు ఇప్పట్లో బద్దలవుతుందా?**

ఐపీఎల్‌అంటే భారీ సిక్సర్‌లు, కళ్లు చెదిరే క్యాచ్‌లు, అదిరిపోయే వికెట్లు మాత్రమే కాదు.. అంతకుమించి అనిపించే రికార్డులు కూడా. 17 సీజన్ల ఐపీఎల్‌లో ఇప్పటివరకు చాలా రికార్డులు నమోదయ్యాయి. అలాంటివాటిలో గత కొన్నేళ్లుగా ఎవరూ టచ్ చేయని, సమీప భవిష్యత్తులో అవకాశం లేని రికార్డులు ఓ సిరీస్‌లో అందించే ప్రయత్నమే ఇది.

ఐపీఎల్‌లో రికార్డులు అంటే గుర్తొచ్చే తొలి పేరు విరాట్ కోహ్లీ . ఈ సిరీస్ ఆయనతోనే స్టార్ట్ చేస్తున్నాం. ఐపీఎల్ పరుగుల విషయంలో ఇప్పట్లో ఎవరూ దరి చేరలేని ఎత్తులో ఉన్నాడు విరాట్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున 252 మ్యాచ్‌లు ఆడి 8,004 పరుగులు చేశాడు. ఈ రికార్డును ఇప్పట్లో కొట్టే ప్లేయర్ దరిదాపుల్లో ఎవరైనా ఉన్నారా? కనిపించడం లేదు.

టాప్ 10 జాబితాలో రెండో స్థానంలో ఉన్న శిఖర్ ధావన్ (6769) దాదాపు ఐపీఎల్‌కి దూరమైనట్లే. కాబట్టి అతడికి ఆ అవకాశం లేదు. ఈ అవకాశం ఉన్న మరో వ్యక్తి రోహిత్ శర్మ (6628). అయితే హిట్ మ్యాన్ వరుస సీజన్లలో భారీ పరుగులు చేయాలి. వయసు రీత్యా అతడు ఎక్కువ సీజన్లు కొనసాగే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లీ రికార్డును ఇప్పట్లో కొట్టేవాళ్లే లేరు.




## డేవిడ్ మిల్లర్ ఎమోషన్స్‌తో ఆడుకోవద్దు: లఖ్‌నవూ మేనేజ్‌మెంట్‌పై విమర్శలు

**ఒకరి భావోద్వేగాలతో వీడియోలు తీసి ప్రమోషన్ కోసం వాడుకోవడం సరికాదని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో కామెంట్లు వస్తున్నాయి.**

శనివారం నుంచి ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విడుదల చేసిన ఓ వీడియో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఎల్‌ఎస్‌జీ ప్లేయర్, దక్షిణాఫ్రికా క్రికెటర్ డేవిడ్ మిల్లర్ 'హార్ట్ బ్రేక్' క్షణాలు ఏంటనే దానిపై స్పెషల్‌గా ఓ వీడియోను రూపొందించింది. ఆఖర్లో ఇచ్చిన క్యాప్షన్ ఇప్పుడు నెట్టింట దుమారం రేపింది. ఇంతకీ ఆ వీడియోలో ఏముంది? మిల్లర్ ఏం చెప్పాడు? ఫ్యాన్స్ ఎలా రియాక్ట్ అయ్యారో చూద్దాం.

గత ఐపీఎల్ మెగా వేలంలో డేవిడ్ మిల్లర్‌ను ఎల్‌ఎస్‌జీ రూ.7.5 కోట్లకు దక్కించుకుంది. గుజరాత్ టైటాన్స్ రిటైన్ చేసుకోని విషయం తెలిసిందే. మార్చి 24న దిల్లీ క్యాపిటల్స్‌తో లఖ్‌నవూ తొలి మ్యాచ్ ఆడనుంది. దీంతో తమ జట్టు ప్రమోషన్ కోసం మిల్లర్‌తో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ శుభమ్ గౌర్ చిట్‌చాట్ నిర్వహించాడు. ఈ సందర్భంగా నాకౌట్ మ్యాచుల్లో ఓడిపోవడం వల్ల మనసు విరిగిన ఘటనలు ఏంటనే ప్రశ్నలు అడిగాడు. దానికి సమాధానం ఇచ్చిన మిల్లర్ 'టీ20 ప్రపంచకప్ ఫైనల్ ఓటమి' తనను మరింత బాధ పెట్టిందని చెప్పాడు. ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లోనూ సఫారీ జట్టుకు చుక్కెదురైన సంగతి తెలిసిందే. 'ఈ సీజన్ నీ హార్ట్‌బ్రేక్‌లను జీరో చేసేస్తుంది' అని క్యాప్షన్ ఇచ్చింది. దీంతో మిల్లర్ ఎమోషన్స్‌తో ఇంటర్వ్యూలు చేయడం అవసరమా? అనే విమర్శలు రావడం మొదలెట్టాయి.

''ఈ వీడియోను చూసేందుకు నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. డేవిడ్ మిల్లర్‌కు నేను పశ్చాత్తాపం వ్యక్తంచేస్తున్నా. అతడి ముందే వరుసగా వైఫల్యాలను అడుగుతూ ఉంటే అక్కడే ఉండటం చాలా బాధగా అనిపించింది''

**"లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సోషల్ మీడియా టీమ్‌ను తొలగించండి. ఇది చాలా బాధాకరం. అత్యంత దారుణమైన ప్రశ్నలు"**
''ఇది చాలా తీవ్ర భావోద్వేగం కలిగించే వైఖరి. లఖ్‌నవూ ఎప్పటికీ గొప్ప జట్టు కాలేదు. ప్లేయర్లతో ఎలా ఉండాలో వారికి తెలియదు''
''అతడేమన్నా మూర్ఖుడా? ఇలాంటి వ్యక్తికి ఇంటర్వ్యూ చేయమని లఖ్‌నవూ ఎలా పర్మిషన్ ఇచ్చిందో అర్థం కావడం లేదు. దక్షిణాఫ్రికా ఓటముల గురించి ఇప్పుడెందుకు?'

# మొదటి రోజే అభిమానులకు బ్యాడ్ న్యూస్
# అదే జరిగితే మ్యాచ్ రద్దు

**ఐపీఎల్ 2025 సీజన్ తొలి మ్యాచ్ ఈడెన్ గార్డెన వేదికగా జరగాల్సి ఉండటంతో ఇదే మైదానంలో ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభ వేడుక నిర్వహిస్తారు. ఐపీఎల్ ప్రారంభ వేడుకల కోసం ఏర్పాట్లు చేయగా.. ఫ్యాన్స్ కూడా ఈ వేడుకను ఆస్వాదించేందుకు సిద్ధమయ్యారు. కానీ కోల్‌కతాలో వర్షం కురిసే అవకాశం ఉందన్న వార్త క్రికెట్ అభిమానులకు నిరాశ కలిగిస్తోంది.**




**మొదటి రోజే అభిమానులకు బ్యాడ్ న్యూస్ అదే జరిగితే మ్యాచ్ రద్దు**
ఐపీఎల్ 2025 సీజన్ కోసం క్రికెట్ అభిమానలు ఎదురుచూస్తున్నారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 22 నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. మొదటి మ్యాచ్ 2024 ఛాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. ఓవైపు ఎండలు మండిపోతున్నాయి. దీంతో మ్యాచ్‌లకు వర్షం అడ్డంకి కాదనేది చాలామంది క్రికెట్ అభిమానుల అభిప్రాయం. కానీ వాతావరణ శాఖ అధికారుల నివేదిక మాత్రం ఐపీఎల్ అభిమానులకు నిరాశ కలిగిస్తోంది.

వాతావరణం సహకరించకపోతే మొదటి మ్యాచ్ రద్దయ్యే అవకాశాలు ఉన్నాయి. తొలి మ్యాచ్ రద్దైతే ఐపీఎల్‌లో లీగ్ మ్యాచ్‌లకు రిజర్వ్‌డే ఉండదు. దీంతో మ్యాచ్ జరగకపోతే రెండు టీమ్‌లకు చెరొక పాయింట్ వస్తుంది. ఐపీఎల్ 2024 ఛాంపియన్ అయిన కోల్‌కతా నైట్ రైడర్స్ తన సొంత మైదనం ఈడెన్ గార్డెన్స్‌లో 2025 సీజన్ మొదటి మ్యాచ్ బెంగళూరుతో ఆడాల్సి ఉంది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌ను విజయంతో ప్రారంభించాలని రెండు జట్లు పట్టుదలలో ఉన్నాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ రానున్న రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని నివేదించడంతో తొలి మ్యాచ్‌పై అనుమానాలు నెలకొన్నాయి.

**ప్రారంభ వేడుకపై అనుమానాలు**
సీజన్ తొలి మ్యాచ్ ఈడెన్ గార్డెన వేదికగా జరగాల్సి ఉండటంతో ఇదే మైదానంలో ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభ వేడుక నిర్వహిస్తారు. ఐపీఎల్ ప్రారంభ వేడుకల కోసం ఏర్పాట్లు చేయగా.. ఫ్యాన్స్ కూడా ఈ వేడుకను ఆస్వాదించేందుకు సిద్ధమయ్యారు. కానీ కోల్‌కతాలో వర్షం కురిసే అవకాశం ఉందన్న వార్త క్రికెట్ అభిమానులకు నిరాశ కలిగిస్తోంది. బంగాళాఖాతంలో వాతావరణ మార్పుల కారణంగా మార్చి 20 నుంచి 22 వరకు పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షం పడటానికి 90 శాతం అవకాశాలు ఉన్నాయని చెప్పడంతో ఐపీఎల్ అభిమానుల్లో నిరాశ నెలకొంది.

**వర్షా లు ఎక్కడెక్కడ**

బిర్భూమ్, ముర్షిధామన్, నాడియా, తూర్పు బంధమాన్ జిల్లాలతో పాటు తూర్పు మిడ్నాపూర్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు, మెరుపులు, వడగళ్ల వర్షంత పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ తెలిపింది. మరోవైపు ఐపీఎల్ మొదటి మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో వరుణడి కరుణపైనే ఈడెన్ గార్డెన్‌లో మంగళవారం మ్యాచ్ ఆధారపడి ఉందని చెప్పుకోవచ్చు.



## ఐపీఎల్‌లో మొదటి రెండు మ్యాచ్‌లకు కేఎల్ రాహుల్ దూరం

**దిల్లీ క్యాపిటల్స్ టీమ్‌లో కీలక ఆటగాడు కేఎల్ రాహుల్ మొదటి రెండు మ్యాచ్‌లు ఆడలేకపోవచ్చు.**

దిల్లీ క్యాపిటల్స్ జట్టు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఐపీఎల్ 2025 మొదటి రెండు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. అతని భార్య అథియా శెట్టి మొదటి బిడ్డకు జన్మనివ్వనుండటమే దీనికి కారణం. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా మహిళా జట్టు కెప్టెన్ అలిస్సా హిలీ ఓ యూట్యూబ్ ఛానల్ వేదికగా తెలిపారు. 'హ్యారీ బ్రూక్ ఐపీఎల్ ఆడటం లేదు. దిల్లీ క్యాపిటల్స్‌లో అతడి స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారో చూడాలి. అలాగే కేఎల్ రాహుల్ కూడా మొదటి రెండు మ్యాచ్‌లు ఆడలేకపోవచ్చు. అతడు తండ్రి కాబోతుండటమే దీనికి కారణం. జట్టు యువ ఆటగాళ్లతో బలంగానే ఉంది. అయినప్పటికీ కేఎల్ రాహుల్ టీ20 (T20)ల్లో చాలా కీలకపాత్ర పోషిస్తాడు. అతని ఆట అద్భుతంగా ఉంటుంది' అని ఆమె అన్నారు. కేఎల్ రాహుల్ ఐపీఎల్ 2025 మెగా వేలంలో దిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం రూ.12 కోట్లకు తీసుకుంది. అంతకు ముందు రాహుల్‌ను లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ వదులుకుంది. గత సీజన్‌లో దిల్లీ క్యాపిటల్స్‌కు సారథిగా వ్యవహరించిన రిషబ్ పంత్ ను దిల్లీ వదులుకుంది. అతణ్ని వేలంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రూ.27కోట్ల భారీ మొత్తం వెచ్చించి కొనుగోలు చేసింది. దిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ కింగ్స్ మార్చి 24న విశాఖపట్నం వేదికగా పోటీ పడనున్నాయి. కానీ ఈ మ్యాచ్‌కు కేఎల్ రాహుల్ అందుబాటులో ఉండటం అనుమానమే.



## ఉప్పల్‌లో ఐపీఎల్ మ్యాచ్.. 2700 మంది పోలీసులతో భారీ భద్రత

**ఐపీఎల్ 2025 ప్రారంభం కానున్న వేళ రాచకొండ పోలీసులు అప్రమత్తమయ్యారు.**

**హైదరాబాద్:** మార్చి 22 నుంచి ఐపీఎల్ 2025 ప్రారంభం కానున్న వేళ రాచకొండ పోలీసులు అప్రమత్తమయ్యారు. మార్చి 23న ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే మ్యాచ్‌కు ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశారు. మొత్తంగా 2700 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ స్టేడియంలో 450 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోనే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏసీపీ సారథ్యంలో భద్రతను పర్యవేక్షించనున్నారు. మరోవైపు, స్టేడియం ఎంట్రన్స్ వద్ద స్నిపర్ డాగ్స్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టనున్నారు. క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే మహిళల కోసం మహిళా భద్రతా విభాగం బృందాలను ఏర్పాటు చేశారు. అభిమానుల కోసం ఐదు చోట్ల ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి వాటర్ బాటిల్స్, ల్యాప్‌టాప్, అగ్గిపెట్టెలు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. ఐపీఎల్ మ్యాచ్ ఉన్న రోజుల్లో నగరంలో అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు నడవనున్నాయి.

## ఐపీఎల్ 2025.. టాప్ 4లో ఎవరు ఉండొచ్చంటే?

**భారీ మార్పులతో ఈసారి ఐపీఎల్‌లోకి పది జట్లు అడుగుపెట్టాయి. ఎవరు ప్లేఆఫ్స్‌కు చేరుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. సీజన్ ప్రారంభానికి ముందే పలువురు మాజీలు తమ అంచనాలను వెల్లడించారు.**

ప్రపంచంలోనే మెగా లీగ్‌కు వేళైంది. శనివారం నుంచి ఐపీఎల్ 2025 మొదలుకానుంది. తొలి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరగనుంది. ఈసారి ఏయే జట్లు ప్లేఆఫ్స్‌కు చేరుకుంటాయో ఇప్పుడే చెప్పడం కష్టమే. కానీ, మాజీ క్రికెటర్లు మాత్రం తమ అంచనాలతో వచ్చేశారు. భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్, మైకెల్ వాన్, ఆడమ్ గిల్‌క్రిస్ట్, షాన్ పొలాక్ తదితరులు స్పందించారు. వీరెవరూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఎంపిక చేయకపోవడం గమనార్హం. ఎక్కువమంది సీఎస్కే వైపూ మొగ్గు చూపలేదు. రోహన్ గావస్కర్, హర్షా భోగ్లే ఆర్సీబీని




సెలక్ట్ చేశారు.

**ఎవరు ఏం చెప్పారంటే?**

- **వీరేంద్ర సెహ్వాగ్: ముంబయి ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్**
- **ఆడమ్ గిల్‌క్రిస్ట్: పంజాబ్ కింగ్స్, ముంబయి, సన్‌రైజర్స్, గుజరాత్ టైటాన్స్**
- **రోహన్ గావస్కర్: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, దిల్లీ క్యాపిటల్స్, ముంబయి ఇండియన్స్**
- **హర్షా భోగ్లే: ముంబయి ఇండియన్స్, సన్‌రైజర్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**
- **షాన్ పొలాక్: ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్**
- **మనోజ్ తివారీ: సన్‌రైజర్స్, పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా**
- **సైమన్ డౌల్: చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్**
- **మైకెల్ వాన్: గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, పంజాబ్ కింగ్స్**